మట్టి పరీక్ష.. పంటకు శ్రీరామరక్ష

- సమగ్ర పోషక యాజమాన్యానికి భూసార పరీక్షలు
- ఫలితాల ఆధారంగా ఎరువుల సమతుల్యతకు ఆస్కారం



మట్టి నమూనాలు సేకరించే విధానంపై సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

అల్లవరం: మనిషికి అవసరమైనట్లే మొక్కలకూ ఆహారం కావాలి. మొక్కలు ఆరోగ్యంగా పెరగటానికి, ప్రత్యుత్పత్తికి 18 రకాల పోషకాలు తప్పనిసరిగా అవసరమని వ్యవసాయ పరిశోధకులు తేల్చారు. కార్బన్, ఆక్సిజన్, హైడ్రోజన్ ధాతువులను గాలి, నీటి నుంచి తీసుకుంటాయి. నత్రజని, భాస్వరం, పొటాష్ ముఖ్య పోషకాలుగాను, మెగ్నీషియం, గంధకం ఉపపోషకాలుగాను, జింకు, రాగి, ఇనుము, మాంగనీసు, బోరాన్, క్లోరిన్, సోడియం, కోబాల్ట్ సూక్ష్మ పోషకాలుగాను విభజించారు. నేలను సారవంతం చేయడానికి, అధిక దిగుబడులు సాధించడానికి భూమి, నీటి నుంచి లభించే ఈ 13 రకాల పోషకాలపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. పండిస్తున్న పంటల వల్ల క్రమంగా భూమిలో ఖాళీ అవుతున్న పోషకాల్ని భర్తీ చేయడానికి మొక్కలకు నిరంతరం పోషకాలు అందించాలి. అందుకే భూసార పరీక్షల ద్వారా భూమిలో పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకుని వాటి స్థాయిని పెంచుకోవాలి.

భూసార పరీక్షలతో పోషకాల నిర్ధారణ

భూసార పరీక్షలతో భూమిలో ఉన్న పోషకాలు, పోషకాల లోపం, ఆమ్ల, క్షార స్థితి, చౌడు, ఇతర సమస్యలు తెలుస్తాయి. భూసార పరీక్షలు నిర్వహించిన అనంతరం పోషక లోపాలను గుర్తించి దానిని అనుగుణంగా పొలంలో ఎరువుల సమతుల్యతను పాటించవచ్చు. భూసార పరీక్షలకు పొలంలో ఆరు అంగుళాలు లేక 15 సెంటీమీటర్ల లోతులో × గె ఆకారంలో గొయ్యి తీసి మట్టిని సేకరిస్తారు. అలా సేకరించిన మట్టిని ల్యాబ్‌కు పంపి పోషకాలను నిర్ధారిస్తారు.

భూసార పరీక్ష కేంద్రంలో ఆరు రకాల పరీక్షలు చేస్తారు. నేల స్వభావం, లవణాల సాంద్రత, ఆమ్ల-క్షార లక్షణం, సేంద్రియ కర్బనం, భాస్వరం, పొటాష్ పరీక్షలు చేసి తద్వారా రైతులకు సూచనలు చేస్తారు. వ్యవసాయ అధికారుల సూచనలతో సాగులో సమతుల్య పోషక పదార్థాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించొచ్చు. భూమిలో లోపాలను గుర్తించడం ద్వారా ఎరువులను సమర్థవంతంగా, పొదుపుగా వినియోగించుకోవచ్చు.

ప్రతి మండలంలో 50 మట్టి పరీక్షలు

వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందుబాటులో తీసుకొస్తూ, అధిక దిగుబడులు సాధించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుంది. రైతు భరోసా కేంద్రం పరిధిలో 2 మట్టి పరీక్షల చొప్పున మండలానికి 50 మట్టి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సామర్లకోటలో ఉన్న భూసార పరీక్షల కేంద్రానికి తీసుకెళ్లి మట్టి నమూనా పరీక్షల నిర్ధారణ పత్రాన్ని రైతులకు అందించేలా చర్యలు చేపట్టారు. ఇటీవల అల్లవరం రైతు భరోసా కేంద్రంలో భూసార పరీక్షల్లో భాగంగా మట్టి నమూనాలు తీసే విధానంపై వ్యవసాయాధికారులు, వ్యవసాయ సహాయకులకు జిల్లా స్థాయి శిక్షణనిచ్చారు.

ఎరువుల సమతుల్యతను పాటించొచ్చు



భూసార పరీక్షల వల్ల సదరు భూమి ఎంత మేర సారవంతంగా ఉందో తెలుస్తుంది. పోషకాలు ఎలా ఉన్నాయో తెలుసుకుని దాని ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టొచ్చు. తద్వారా తక్కువ వ్యయంతోనే పంట దిగుబడి పెంచుకోవొచ్చు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువుల సమతుల్యతను పాటించొచ్చు.

– ఎంఏ షంషీ, ఏడీఏ, అమలాపురం

మృతుల బంధువులకు నేతల పరామర్శ



అమలాపురం ఏరియా ఆస్పత్రిలో మృతుల బంధువులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు

అమలాపురం టౌన్: ముమ్మిడివరం సమీపంలో 216 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినవారి కుటుంబీకులు, బంధువులను వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సోమవారం ఉదయం పరామర్శించి ఓదార్చారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వెంకట స్వామి, కృష్ణ, రమేష్‌కుమార్‌ల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించడంతో వారి కుటుంబీకులు, బంధువులు అక్కడకు చేరుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యుడు జక్కంపూడి కిరణ్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, మున్సిపల్ కౌన్సిలర్ దొమ్మేటి రాము తదితరులు ఏరియా ఆస్పత్రికి వచ్చి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



గాడిమొగ పంచాయతీలో వలంటీర్లను సత్కరించిన ప్రజాప్రతినిధులు

తాళ్లరేవు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో గ్రామ వలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. సోమవారం గాడిమొగ పంచాయతీలో గ్రామ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి అధ్యక్షతన జరిగిన వలంటీర్ల సత్కార కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు వలంటీర్లు వారధులుగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా వలంటీర్లను దుశ్శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. అదేవిధంగా కోరంగి పంచాయతీలో సర్పంచ్ పెయ్యల మంగేష్ అధ్యక్షతన వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీ కొపనాతి లలిత, నాయకులు కామాడి మాతరాజు, వనమాడి నూకరాజు, ఉప సర్పంచ్‌లు కొక్కిలిగడ్డ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్
- కొమరగిరిపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వం



కొమరగిరిపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, పినిపే శ్రీకాంత్

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత ఉన్న లబ్ధిదారులకు పారదర్శకంగా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందిస్తున్నామని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. మండల నోడల్ అధికారి ఎంపీడీఓ జి.సరోవర రావు ఆధ్వర్యంలో కొమరగిరిపట్నం-3 సచివాలయం పరిధిలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంత్రి విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారన్నారు. నాలుగేళ్ల కాలంలోనే 95 శాతం హామీలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగించాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, టీపీసీ మెంబర్ కుడుపూడి శ్రీను, మాజీ ఏఎంసీ చైర్మన్ గునిశెట్టి చినబాబు, సలహా మండలి సభ్యులు నిమ్మకాయల శేఖర్, గ్రామకమిటీ అధ్యక్షుడు కడలి లక్ష్మణరావు, సొసైటీ చైర్మన్ గుర్రం బాబులు తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో గడప గడపకూ సంక్షేమం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- సోమిదేవరపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం



సోమిదేవరపాలెం గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ముమ్మిడివరం: ప్రభుత్వం అమలుచేస్తున్న నవరత్న పథకాలతో ఇంటింటికీ సంక్షేమ లబ్ధి అందుతోందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి సోమిదేవరపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో తమకు లక్షలాది రూపాయల మేర లబ్ధి చేకూరిందంటూ సంతోషం వ్యక్తం చేశారు. మళ్లీ జగన్‌బాబే సీఎం అంటూ జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి అంతా తోడుగా నిలబడాదామన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజు, మండల పార్టీ కన్వీనర్ జగతా పద్మనాభం, తాడి అచ్యుతరామయ్య, వస్త్రాల వీరన్న, బుడితి శ్రీను, వైస్ చైర్మన్ వేటుకూరి బోసురాజు, రెడ్డి శివన్నారాయణ, దొమ్మేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

- ప్రధాన కూడళ్లలో వేగ నిరోధకాల ఏర్పాటు
- జాతీయ రహదారిలో చెక్‌పోస్టులు కట్టుదిట్టం



తాళ్లరేవు బైపాస్ రహదారిలో ప్రమాదాల నివారణకు కోరంగి పోలీసులు ఏర్పాటు చేసిన వేగ నిరోధకాలు

తాళ్లరేవు: ఇటీవల వరుస ప్రమాదాలతో జాతీయ రహదారి-216 మరణ మృదంగం మోగిస్తుంది. తరచుగా ఏదో ప్రమాదం జరుగుతుండడంతో వాహన చోదకులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల కోరంగి పంచాయతీ సీతారామపురం సుబ్బారాయుని దిమ్మ వద్ద ఆటోను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో ఎనిమిది మంది మృత్యువాత పడడం తీవ్ర చర్చనీయాంశమైంది. దీంతో కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ స్పందించి హైవేలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణకు కోరంగి పోలీసులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. జాతీయ రహదారి-216లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వేగ నిరోధకాలను ఏర్పాటు చేస్తున్నారు. అత్యంత రద్దీగా ఉండే కూడళ్లలో డివైడర్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తూ నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నారు. అధిక ప్రమాదాలు మద్యం మత్తులో జరుగుతున్నట్లుగా గుర్తించి జాతీయ రహదారిలో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అత్యవసరం

జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్



చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ శ్రీధర్, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ తదితరులు

అమలాపురం టౌన్: ఎన్నడూ లేని విధంగా వేసవిలో ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎక్కడికక్కడ చలి వేంద్రాల ఏర్పాటు అత్యవసరమని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డు డీఎస్పీ కార్యాలయం వద్ద అమలాపురం వాకర్స్ క్లబ్, జిల్లా పోలీసు శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్‌తో కలిసి ఎస్పీ శ్రీధర్ సోమవారం ఉదయం ప్రారంభించారు. తొలి రోజు చలివేంద్రానికి మజ్జిగ సమకూర్చిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్‌ను ఎస్పీ శ్రీధర్ అభినందించారు. కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయ ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, చాంబర్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్తిబాబు, పంచాయతీ రాజ్ డీఈఈ అన్యం రాంబాబు, పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి, ఎస్పీ కార్యాలయ ఎస్పీ సీఐ కోలా రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక



సాఫ్ట్‌బాల్ టీమ్‌కు ఎంపికైన బాలికలు

ఐ.పోలవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలుర, బాలికల టీమ్ ఎంపిక ముగింపు కార్యక్రమం ఐ.పోలవరం కాలేజీ గ్రౌండ్స్‌లో జరిగింది. ఈ నెల 12 నుంచి 22 వరకూ జరిగిన కార్యక్రమంలో 16 మంది బాలురు, 16 మంది బాలికలను ఎంపికచేశారు. వారంతా ఈ నెల 26 నుంచి 28 వరకూ కడప జిల్లా రాయచోటిలో జరిగే స్టేట్ మీట్‌లో పాల్గొంటారని అసోసియేషన్ కార్యదర్శి ఏఎస్ రాంప్రసాద్ తెలిపారు. ముగింపు కార్యక్రమంలో ఎంపికైన క్రీడాకారులకు సినీ నిర్మాత రాయపురెడ్డి రాజా ఆర్థిక సాయంతో స్పోర్ట్స్ కిట్లను ఎంఈఓ ఎం.వెంకటేశ్వరరావు, ఐ.పోలవరం హెచ్‌ఎం వి.సురేష్ బాబులు అందజేశారు. క్రీడాకారులకు వసతి, భోజనం, ప్రయాణ ఖర్చుల కోసం స్థానిక సర్పంచ్ దంతులూరి రాఘవరాజు, రాయపురెడ్డి నీలకంఠేశ్వరావు, సాగిరాజు శ్రీను తదితరులు ఆర్థిక సాయం చేశారు.

దేవస్థానం భూమిని రక్షించాలి



ఆర్‌ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

యానాం: ఆక్రమణకు గురైన యానాం భూసమేత వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం భూమిని రక్షించాలని కోరుతూ సోమవారం స్థానిక దరియాలతిప్ప, సీతారామనగర్ తదితర ప్రాంతాలకు చెందిన పెద్దలు ఆర్‌ఏఓ మునిస్వామికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్రమణలో ఉన్న టీఎస్ నెంబరు 12, 1లోని భూమి బెజవాడ బాపన్ననాయుడు, బెజవాడ వెంకటరెడ్డి సుబ్బారాయుడు, రామదాసు భాస్కరరావు, రిటైర్డ్ తహసీల్దార్ నిరంజనరావుల వంశీయులు వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి దానం చేశారన్నారు. ఈ భూమిని కొంతమంది ఆక్రమించి లీజుకు ఇచ్చారన్నారు. దీనిపై విచారణ చేసి దేవస్థానం భూమిని కాపాడాలని కోరారు. వినతి పత్రం ఇచ్చినవారిలో గ్రామస్తులు మోకా బుజ్జి, ఎం.నూకరాజు, సబ్బతి లోకేశ్వరరావు, శ్రీనివాస్, చోడే సుబ్బారావు, రేవు నాగేశ్వరరావు తదితరులున్నారు. ఇదే భూమి విషయంలో ఆక్రమణలు తొలగించాలని కోరుతూ రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ బెజవాడ నిరంజనరావు సైతం ఆర్‌ఏఓ మునిస్వామికి వినతి పత్రం అందజేశారు.

రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలంటూ వినతి

అమలాపురం రూరల్: అమలాపురం పట్టణంలోని సీతాపతిరావుపేటలో సుమారు 3.40 ఎకరాల మేర భూముల క్రయవిక్రయాలు నిలిపేశారంటూ స్థానికులు సోమవారం జరిగిన స్పందనలో కలెక్టర్ హిమాన్షుశుక్లాకు ఫిర్యాదుచేశారు. అది గ్రామ కంఠం స్థలమని, సుమారు 80 ఏళ్లగా 200 కుటుంబాలు నివసిస్తున్న సదరు ప్రాంతాన్ని నిషేధిత జాబితాలో చేర్చారని, రిజిస్ట్రేషన్లను పునరుద్ధరించాలని కోరారు. కలెక్టర్‌కు ఫిర్యాదుచేసినవారిలో సుందనీడ సత్యనారాయణ, గుత్తుల వెంకటేశ్వరరావు, దంగేటి చంద్రమోహన్, బుజ్జమ్మ, మాదిరెడ్డి వెంకట్రావు తదితరులున్నారు.

మూగజీవాల్లో మానవత్వం

అల్లవరం: మానవత్వం మనుషులకే కాదు మాకు ఉందని ఆ మూగజీవాలు చాటుకున్నాయి. మండలంలోని కొమరగిరిపట్నం శివారు ఎస్.రామేశ్వరంలో ఓ అంబోతు అనారోగ్యంతో మృతి చెందింది. మృతి చెందిన అంబోతుని సముద్రం తీరంలో ఖననం చేసేందుకు ఏపీఈపీడీసీఎల్ లైన్‌మెన్ బండారు పల్లంరాజు ట్రాక్టర్‌పై తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే అక్కడే ఉన్న మరో అంబోతు, ఆవుదూడ దాదాపు అరగంట పాటు ట్రాక్టర్ కదలనీయకుండా అడ్డుకున్నాయి. ఈ దృశ్యం అక్కడున్న అందరి మనసులను కదిలించింది.

క్లుప్తంగా

అనంగేశ్వర స్వామి ఆలయంలో నక్షత్ర పూజ



ప్రత్యేక అలంకరణలో అనంగేశ్వర స్వామి

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి అనంగేశ్వర స్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివునికి రుద్రాభిషేకం, లక్షపత్రి పూజలు చేసి పూర్ణాహుతి జరిపారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రమాదం వల్లే బాలిక మృతి

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన బాలిక జంగా లక్ష్మీజాహ్నవి బలమైన గాయం తగలడం వల్లే మృతి చెందినట్లు పోస్టుమార్టంలో తేలిందని పట్టణ సీఐ ద్వారంపూడి దుర్గా శేఖర రెడ్డి తెలిపారు. ఏదైనా వాహనం బలంగా ఢీ కొట్టిందేమోనన్న కోణంలోను దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆ రోడ్డులో ఉన్న సీసీ కెమెరా నుంచి ఫుటేజీ సేకరించి అనుమానం ఉన్న వాహనాలపై దృష్టి పెట్టామని చెప్పారు. ఇప్పటికే కొన్ని వాహనాల డ్రైవర్లను విచారించామన్నారు. కేవలం ప్రమాదం వల్లే బాలిక మృతి చెందిందని, ఇతర కారణాలేమీ కనిపించడం లేదన్నారు. ఈ విషయంలో ప్రజలకు ఎలాంటి అపోహలున్నా విడనాడాలని సీఐ దుర్గాశేఖరరెడ్డి స్పష్టం చేశారు.

చలివేంద్రంలో షర్బత్తు పంపిణీ

అమలాపురం టౌన్: స్థానిక దక్షిణేశ్వర కాలభైరవ శక్తి స్థల్‌లో గౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో నడుస్తున్న చలివేంద్రంలో షర్బత్తును మంగళవారం నుంచి ఉచితంగా పంపిణీ చేయనున్నారు. రూ.40 వేల విలువైన నన్నారి షర్బత్తును మద్రాస్ సాంబార్ మసాలా కంపెనీ ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రతినిధి మోహద్ సుభాన్ చేతుల మీదుగా స్థానిక చలివేంద్రం వద్ద సోమవారం ఉదయం అందజేశారు. మంగళవారం నుంచి షర్బత్తును పంపిణీ చేస్తామని చలివేంద్ర నిర్వాహకులు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యానాం: నియోజకవర్గ పరిధిలోని మెట్టకూరు 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ నెల 24వ తేదీ బుధవారం యానాం నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఏఈ లంక కృష్ణారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్‌ను నిలిపేయనున్నట్లు చెప్పారు.

అన్నదాన ట్రస్టుకు రూ.10 వేలు విరాళం



అన్నదాన పథకానికి విరాళం అందజేస్తున్న దాత వెంకట నాగలక్ష్మీపార్వతి

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన ట్రస్టు కోసం గుంటూరుకు చెందిన ఆదిమూలం వెంకట నాగలక్ష్మీపార్వతి సోమవారం రూ.10 వేల నగదును ఆలయ పర్యవేక్షకులు బి.వీరభద్రరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు



స్థానిక మూడుతూముల జంక్షన్ వద్ద ఉన్న పెట్రోల్ పంపును పరిశీలిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: యానాం నియోజవర్గ పరిధిలోని పలు పెట్రోల్ బంకులను ఆర్‌ఏఓ మునిస్వామి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాల్సిన మౌలిక సౌకర్యాల కల్పన తదితర అంశాలపై ఆరా తీశారు. కొత్తగా ఏర్పాటు చేసిన పెట్రోల్ పంపులను సైతం ఆయన పరిశీలించి నిబంధనల ప్రకారం సీల్ వేశారు. ఈ కార్యక్రమంలో తూనికలు, కొలతల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కుటుంబరావు నియామకం

తాళ్లరేవు: బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా న్యాయవాది యడ్ల కుటుంబరావు నియమితులయ్యారు. విజయవాడ ఉండవల్లిలోని రాజగృహాలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు హరిబాబు, ఉపాధ్యక్షుడు మట్టా వెంకట్రావు, బౌద్ధ మహాసభ అధ్యక్షుడు పిల్లి రాంబాబులు నియామక పత్రం అందజేసినట్లు కుటుంబరావు సోమవారం విలేకర్లకు తెలిపారు.

సాత్విక్‌కు సత్కారం



సాత్విక్, అతడి తల్లిదండ్రులను సత్కరిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నానిరాజు తదితరులు

అమలాపురం టౌన్: దుబాయ్‌లో జరిగిన ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతాకాన్ని సాధించి దేశానికి ఎనలేని కీర్తిని తెచ్చిన అంతర్జాతీయ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజు కోనసీమ జిల్లాకే గర్వకారణమని మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అన్నారు. స్థానిక కూచిమంచి అగ్రహారంలో సాయి సంజీవిని వాకర్స్ యోగా ఆరోగ్య సేవా సంస్థ ఆధ్వర్యంలో సాత్విక్‌కు అభినందన సభ సోమవారం నిర్వహించారు. ఈ సత్కార సభలో సాత్విక్‌తో పాటు ఆయన తల్లిదండ్రులు రంకిరెడ్డి కాశీ, రంగమణిలను సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని తదితరులు సాత్విక్ క్రీడా ప్రతిభను అభినందించారు.

కలెక్టరేట్ ఉద్యోగులకు యూనిఫాం పంపిణీ



కలెక్టరేట్ ఉద్యోగులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: కలెక్టరేట్‌లో పనిచేస్తున్న రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ ఆఫీస్ సబార్డినేట్, డ్రైవర్లకు రెండు జతల యూనిఫాం, ఒక జత షూలను కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ చాంబర్‌లో పంపిణీ చేశారు. ఏటా నాలుగో రెవెన్యూ సిబ్బందికి, డ్రైవర్లకు బట్టలు పంపిణీ చేయడం ఆనవాయితీ అని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు పదోన్నతి



పదోన్నతి పొందిన వారితో ఏఎస్పీ లతామాధురి

అమలాపురం టౌన్: జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)లో పది మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. వీరికి స్థానిక ఎస్పీ కార్యాలయంలో సెబ్ ఇన్‌చార్జి అసిస్టెంట్ సూపరింటెండెంట్, జిల్లా ఏఎస్పీ కె.లతామాధురి సోమవారం నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సెబ్ అమలాపురం సీఐ వేగిశ్న శివరామరాజు కూడా పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తాళ్లరేవు: జాతీయ రహదారి-216లోని సుంకటరేవులో పి.మల్లవరం జంక్షన్ వద్ద ధూళిపూడి మాణిక్యాంబ సోమవారం చలివేంద్రం ఏర్పాటుచేసి ప్రారంభించారు.

కలెక్టరేట్‌లో...

అమలాపురం రూరల్: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన అర్జీదారుల కోసం చిందాడగరువు ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ, వెంకటేశ్వరరావు దంపతులచే మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

అల్లవరం: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా అల్లవరం గ్రంథాలయంలో బైర్రాజు ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించనున్నామని గ్రంథాలయాధికారి ద్వారకామణి సోమవారం తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కలుషిత తాగునీటి సరఫరాపై ఫిర్యాదు

యానాం: యానాం నియోజకవర్గ శివారు కనకాలపేట గ్రామ పరిధిలో కలుషిత తాగునీరు సరఫరా అవుతుందని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్‌ఏఓ మునిస్వామి తక్షణం స్పందించి సోమవారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డ్రెయిన్ వాటర్ కలుస్తున్న ప్రదేశాన్ని గుర్తించి దాన్ని అరికట్టాలని పీడబ్ల్యూడీ ఏఈ నాగరాజు, జేఈ హుస్సేన్‌లను ఆదేశించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

యానాం: యానాం నుంచి అక్రమంగా ఆంధ్రా ప్రాంతానికి మద్యం తరలిస్తున్న మలికిపురానికి చెందిన ఉండమెట్ల చిట్టిబాబు, ఉండమెట్ల ప్రసాద్‌లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శేరు నూకరాజు సోమవారం తెలిపారు. వారి బైక్‌తో పాటు 750 ఎంఎల్ 60 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో ఘటనలో అక్రమంగా మద్యం తరలిస్తున్న గిరియాంపేటకు చెందిన సంగాడి వెంకటరమణ, కర్రి ధర్మారావులను కురసాంపేట టైడల్ లాకు వద్ద అరెస్ట్ చేసి వారి నుంచి 36 మద్యం సీసాల్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

తాళ్లరేవు: యానాం నుంచి కారులో మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాసకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారి-216లో జార్జిపేట పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పిఠాపురం రూరల్ మండలం కుమారపురం గ్రామానికి చెందిన మేడపాటి రామకృష్ణ కారులో 125 మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తున్నట్లుగా గుర్తించి వాటిని సీజ్ చేశామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.